# దొంగ భయం

(కథానిక)

"అమ్మో దొంగదొంగ!" అంది హఠాత్తుగా శారద. రామకృష్ణ ఖంగారుగా లేచాడు. శారద రామకృష్ణ ముఖంలోకి కొంటెగా చూసి పకపక నవ్వింది. ఆ నవ్వులో ఏ వలపుల తొలకరి కనిపించిందో, ఆ నవ్వు తెరల వెనుక ఏ మధుర గాథలున్నాయో, రామకృష్ణ ఒక్కసారి పక్కమీంచి లేచాడు శారద అతనికి దొరక్కుండా మంచంచుట్టూ తిప్పిస్తూ "ఉండండి. మా అమ్మతో చెబుతాను" అంది నవ్వుతూనే. "మళ్ళీనా" అన్నాడు రామకృష్ణ. శారద కౌగిలికే అతనికి దొరికిపోయింది

* * *

సరిగా కిందటనెల ఈ రోజుల్లోనే పెరట్లో మసక వెన్నెలలో కొబ్బరిచెట్ల చల్లనిగాలి అనుభవిస్తూ శారదా, సుబ్బమ్మగారూ పక్కపక్కని మంచాలేసుకుని పడుకున్నారు. అర్థరాత్రి సమయం. తల్లీ కూతుళ్ళిద్దరూ గాఢ నిద్రలో వున్నారు. శారద ఉన్నట్టుండి గట్టిగా "అమ్మో! దొంగ దొంగ!" అంది. సుబ్బమ్మగారికసలే భయం. మనిషి సాయంలేనిదే పగలయినా ఒక్కర్తే డాబామీదకు వెళ్ళలేదు. ఈ కబురు విని ఆమె నిద్రనుండి లేచిందిగాని మంచంమీంచి లేవలేదు. శాలువలోంచి కళ్లు చించుకుని చూడగా శారద తలదగ్గర ఏదో నల్లని ఆకృతి కనపడి ఆవిడ ఒళ్ళంతా వణికి కళ్ళు గట్టిగా మూసుకుంది. శారద మళ్ళీ కేక వెయ్యలేదుగాని అయిదునిముషాల్లో చుట్టుపట్ల వాళ్ళందరూ వచ్చేరు. సుబ్బమ్మగారు ధైర్యంగా ముసుగుతీసి శారద పక్కమీద చూస్తే ఆవిడ లేదు. చేతులు రెండూ నులుపుకుంటూ ఖంగారుగా గదిలోంచి వస్తోంది.

"ఏమిటమ్మాయ్? ఎక్కడ దొంగ?" శారద మాట్లాడలేదు.

"మాట్లాడవేమే? ఏమైందే? ఎవరొచ్చారు? అసలేమిటి జరిగిందీ?" సుబ్బమ్మగారడిగింది.

సరే, ఇంత గొడవ జరిగిన తరువాత యింట్లో వాళ్లు రాకుండా వుంటారా? టార్చిలైటు పట్టుకుని రామం, చంటిపిల్లాడిని భుజాన వేసుకుని లక్ష్మి గదితలుపు తీసుకుని యివతలికొచ్చారు. రామం అడిగాడు.

"ఏమే చెల్లీ, ఎవడొచ్చాడు? ఏమిటంతలా అరిచేవు?"

"దాన్నడుగుతే అదేం చెబుతుందిరా! హడలిపోయింది కుర్రప్రాణం, ఇలావచ్చి యిక్కడ ఓగడీ పడుకోవే తల్లీ. లక్ష్మీ పాపాయిని అలా పడక్కుర్చీలో పడుకోబెట్టి ఓ గ్లాసుడు చల్లటి నీళ్ళు తీసుకురా అమ్మా." సుబ్బమ్మగారు అనుకున్నట్టే జరిగింది.

"ఎక్కడా ఎవరూ లేడమ్మా. కలొచ్చిందో మిటో." అని దొంగని వెతకడానికి వెళ్ళిన నలుగురూ ఎవరింటికి వాళ్లు వెళ్ళిపోయారు.

"లక్ష్మీ విసనకర్ర తీసుకురా" అంది మళ్ళీ సుబ్బమ్మగారు. లక్ష్మి వెళ్ళింది. ఈ హడావిడికి పక్కలాడ్జిలో పరీక్షలకని చదువుకుంటున్న స్టూడెంట్సు యిద్దరు ముగ్గురు వచ్చారు.

"అసలు ఏమిటయిందే చెల్లీ?" అని మళ్ళీ అడిగాడు రామం.

"ఏం... ఏంలేదు, ఎవరూ రాలేదు. అనవసరంగా భయపడ్డాను" అంది శారద అదోలా చూస్తూ.

"ఒంటరిగా పడుకున్న ఆడాళ్ళకి యిలాంటి రోజుల్లో అలాంటి భయాలు సహజమే" ఏ స్టూడెంటు అన్నాడోగాని యీ మాటకి అందరూ ఫక్కున నవ్వేరు. ఈ మాట రామం మాత్రం సహించలేదు.

"ఎవ్వడ్రా? ఎవడామాట అన్నది. పళ్ళు రాలగొడతాను" అని రామం పారిపోతున్న స్టూడెంట్సువైపు పరిగెట్టేడు. సుబ్బమ్మగారూ

అవసరాల రామకృష్ణారావు

శారదా యిద్దరే మిగిలారు మళ్లీ. సుబ్బమ్మగారడిగింది.

"ఏమే శారదా. ఎవరూ లేరంటావేం? నాకెవరో కనపడితేనే!" శారద జవాబు చెప్పేలోగా లక్ష్మి అతి ఖంగారుగా అక్కడికి పరుగెత్తుకొచ్చింది.

"అత్తయ్యా! అత్తయ్యా! నేను విసనకర్ర కోసం పెరటి గదిలోకి వెళ్ళేసా, అక్కడ యెవళ్ళో ఉన్నారమ్మా!" అంది అతి కష్టపడుతూ. సుబ్బమ్మగారికి కాళ్ళూ చేతులూ ఆడలేదు.

"దొంగ కాదు కాదు వెధవ, డొక్క చీల్చేద్దును!" అంటూ రామం అక్కడకొచ్చేడు.

"అసలు ఆ మాట ఎవరన్నారో తెలిసిందా అన్నయ్యా?" అని శారద అడిగింది.

"అదేమిటమ్మా ఒదినా! ముందు పెరటి గదిలో ఎవరున్నారో చూడనీ."

"నువ్వొక్కడిదాకా వెళ్ళేవురా అన్నయ్యా?" లక్ష్మి మాటలు మధ్యలో ఆపేసింది శారద.

ఈ మాటకి రామం జవాబు చెప్పలేదు.

"పెరటి గదిలో ఎవరున్నారూ? ఏమిటే లక్ష్మీ?" లక్ష్మి టార్చిలైటు తీసుకుని రామాన్ని తనతో తీసుకెళ్లింది. పెరటిగదిలో ఎవరూ లేరు. ఆ సంగతి తెలిసిన తరువాత యెందుచేతో గాని శారద ధైర్యంగా గుండె రాసుకుంది. ఆసంగతి ప్రక్కనున్న లక్ష్మి గమనించకపోలేదు.

* * *

కాలేజీకి వెళ్ళిన శారద యింకా రాలేదు. పాపాయిని రామం వళ్లో కూర్చోబెట్టుకుని ఆడిస్తున్నాడు. వంటింటి గడపమీద సుబ్బమ్మగారు కూర్చుని కోడలికి వంట పురమాయిస్తోంది.

"అయితే అత్తయ్యా, మీ రెప్పుడేనా దొంగని చూశారా?"

సుబ్బమ్మ గుండెలు ఝల్లుకున్నాయి.

"రాత్రి జరిగిన గొడవ చాలు. మళ్ళీ ఎందుకే అదిప్పుడూ?"

"అబ్బే దానికి కాదు, చూశారా అని."

"ఎప్పుడో ఎందుకు, నిన్నరాత్రే చూశాను. అయితే కాలువలోంచి చూడ్డంవల్ల ఆ గుడ్డి వెన్నెలలో ఆకారం మాత్రమే కనిపించింది. ఏం?"

లక్ష్మి ఎందుకో ఫక్కున నవ్వింది.

"ఏమిటే ఆ నవ్వూ?"

"అబ్బెబ్బే, ఏం లేదుగాని దొంగ లెలా ఉంటారు అత్తయ్యా?"

"అబ్బ! ఎందుకే అక్కర్లేని ప్రసక్తి? నీకు దొంగపిచ్చి పట్టుకున్నట్టుంది."

దొంగ పిచ్చి ఎవరికి పట్టుకుందో లక్ష్మికి తెలుసు. లక్ష్మి ఆదోలా చూస్తూ మళ్ళీ సుబ్బమ్మనడిగింది, "పోనీ ఒకటడుగుతాను చెప్పండి. దొంగలు గోచీలు పెట్టుకొని, మొహాన్ని నల్ల రంగు రాసుకుని, నూనె రాసుకుని రాకపోయినా గిరగిరల పైజామా, తెల్లని చొక్కా తొడుక్కుని, మొహాన పౌడరు రాసుకుని, వాసన నూనె రాసుకుని రారు కదా?" ఈ మాట అడుగుతూ లక్ష్మి పకపకనవ్వింది. ఇంతట్లో రామం పాపాయి నెత్తుకుని అక్కడికి వచ్చాడు. లక్ష్మి యింకా నవ్వుతూనే ఉంది

"ఎందుకే అలా నవ్వుతోంది?" అని తల్లి నడిగాడు

"ఏమో బాబూ! ఈ కాలపువాళ్ళ ఆలోచనలు యెవరికర్థమౌతాయి? దొంగ పారిపోయినా మీ ఆవిడ వాడిని వదిలేలా లేదు. నువ్వే కనుక్కో" అని కొడుకు చేతిలో పాపాయిని తీసుకుని, "పదరా బాబూ! నీకూ నాకూ ఏమన్నా అరమవ్వాలా, ఏడవాలా?" అంటూ వీథివైపు వచ్చేసింది

అప్పుడే కాలేజీ నుంచి వస్తున్న శారద బుక్స్ అక్కడ పడేసి, "ఏమిటే అమ్మా అది" అంది. కోడలు తనకు అర్థం కాకుండా అన్న మాటలు వింటే; చెప్పకేం, సుబ్బమ్మగారికి కొత్త ఉక్రోషంగానే ఉంది చేతులు ఆడిస్తూ, "ఏమో తల్లీ! మీ ఒదినగార్నే కనుక్కో, మాకేం బోధపడాలా, చావాలా?" అంది

శారద సరాసరి వంటింట్లోకి వచ్చి "ఏమిటి ఒదినా నవ్వు ఆపలేకుండా ఉన్నావు, ఏం జరిగిందేమిటి?"

"ఎలా పట్టగలను ఒదినా, జరిగింది మరోటీ మరోటీ గనక నాకీ సరేగాని యీ రాత్రి ఏం చేస్తావా, నిన్నటిలా నగలన్నీ తీసి యినప్పెట్టెలో పెట్టెయ్యకు. దొంగ వచ్చాడన్నా

ఎవరూ నమ్మరు." శారద మొదట తెల్లబోయి, తరువాత నవ్వుకుని, తెలివి తెచ్చుకుని "నీ మాటలు నాకేం బోధ పడ్డంలేదు ఒదినా" అంటూ జవాబుకేనా చూడకుండా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

"ఏమిటీ గూఢపురాణీ? జరిగింది చెబుతావా, లేకపోతే నిన్ను ముట్టుకోమన్నావా"

"ముట్టుకుంటే ముట్టుకోండి. నాకేం? వంటవలేదని యిప్పటికే మీ అమ్మగారు దెబ్బలాడుతున్నారు. సరేగాని మీరిన్ని కథలు రాస్తారు కదా, ఆ మాత్రం ఊహించలేరూ?"

"ఏమిటీ ఊహించడం? ఇప్పటికే విసుగెత్తి బుర్ర ఆలోచించడం మానేసింది. జరిగిందేమిటో చంపక చెబుదూ"

"నిన్న రాత్రి వొచ్చినవాడు దొంగనంటారా?"

"మరెవరు?"

"మీ తెలివిగాని అసలు, దొంగ ఎందుకు వస్తాడు? డబ్బుకేనా? నిన్న రాత్రి ఒదిన నగలు నా నగలూ పూర్తిగా తీసేసి మీరు యినప్పెట్టెలో పెట్టేశారా? నగలు లేవని స్పష్టంగా తెలుస్తూంటే ఇంకా అతను మీ చెల్లి పక్కలో ఎందుకు కూర్చోవాలి?"

"ఏమిటి నీ ఉద్దేశం?"

"పూర్తిగా వినండి. పక్కని మీ అమ్మ ఉన్నారు. ఆవిడ చేతిని పూర్వకాలపు గాజులు రెండున్నాయి. దొంగ దృష్టి అటువైపేనా పోలేదేం?"

"ఏం తంటావ్?"

"అయ్యో రామా, యింకా బోధపడలేదూటండీ మీకు? ఇంకోటి. అందరూ వచ్చేసరికి మీ చెల్లి పక్కమీద లేకపోగా యిట్లోంచి వస్తున్నదలేమిటీ? నేను విసనకర్ర కోసం గదిలోకి వెడితే తెల్లని డ్రస్సు, దువ్వుకున్న క్రాఫింగు- మొదట నేను భయపడిపోయి తరువాత తెలుసుకున్నానుగాని యివన్నీ దొంగ లక్షణాలంటండీ?"

"అయితే ఏమిటంటావ్?"

"ఈ పక్క స్టూడెంట్స్ లాడ్జిలో రామకృష్ణ అని ఒకతనున్నాడు. మీకు తెలుసునో తెలీదో! అతను ఆ మేడ మీంచీ, ఒదిన కిందనుంచీ లక్షమార్లు చూసుకోడం నా కళ్ళతో నేను చూశాను. అతనే నిన్నరాత్రి ఒస్తే."

"అలాగా? ఉండు ఈ వెధవ్వేషాలేమిటో దాన్ని కనుక్కుంటా."

"బాగుందండీ. వయస్సొచ్చిన పిల్లకి పెళ్ళి చెయ్యడం చేతకాదుగాని మీకిది చాలనవునా? ఇద్దరూ అందమైనవాళ్ళూ, మనుష్యుల్లో ఉన్నవాళ్ళూ. వాళ్ళ తప్పేమిటి? మీరు మొట్టమొదట్లో నాకోసం ఎన్ని అవస్థలు పడ్డారు కాదూ? నా ఉద్దేశం యిది. రాత్రి యిలా జరిగి ఉంటుంది: ముందు ఎప్పుడే నా మాట్లాడుకున్నారో ఏమిటో నాకు తెలీదు. అతను రాత్రి వచ్చి ఆమె దగ్గిర కూర్చున్నాడు. ఆమె ఆ నిద్దర్లో ఎవరో అనుకుని కేక వేసింది. తరువాత తెలుసుకుంది. అప్పటికప్పుడు ఏం చేస్తుంది? అందుకనే పెరటి గదిలో దాచింది. నేనుచూసి వచ్చి, మళ్ళీ మనమిద్దరం వెళ్ళేలోగా అతను పెరటి తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు. వదిన చర్యలు కనిపెడుతూనే ఉన్నాను" రామానికి ఏం తోచిందో తల్లిని పిలిచాడు.

"ఏం బాబూ అయిపోయాయా రహస్యాలు? నేను రావచ్చునా?" అంది సుబ్బమ్మగారు.

"బాగుందమ్మా! నువ్వు ఎప్పటికప్పుడు అలా అనుకుంటూ ఉంటావుగాని నీకు తెలీని రహస్యాలేమున్నాయ్? సరేగాని, చెల్లి దాని పెళ్ళి అదే కుదుర్చుకుంది. నిన్నరాత్రి వచ్చినవాడు దొంగకాదు, నీ అల్లుడే." సుబ్బమ్మ ఆశ్చర్యపోయింది.

రామకృష్ణ చదువు, ఆస్తి, అన్నీ సుబ్బమ్మగారికి నచ్చాయి. వెంటనే పెళ్ళయిపోయింది.

* * *

సరిగ్గా నెల్లాళ్ల తరువాత, పెరట్లో మసక వెన్నెలలో, కొబ్బరిచెట్ల చల్లనిగాలి అనుభవిస్తూంటే శారద "దొంగ దొంగ!" అని అరిచింది. రామకృష్ణ కౌగిలిలో ఆమె ఒదినకి మనసారా నమస్కరించింది.